# రాజమ్మ పెళ్ళి

వారపత్రికల ధర పావలా వున్నప్పుడు గూడా వెంకటరత్నం మాష్టారు తన జీవితంలోంచి ఒక్క పావలా ఖర్చుపెట్టి, తనచేత్తో ఒక్కగానొక్క పత్రికయినా కొన్న పాపాన పోలేదు. ఆయనకి పత్రికలు చదివే అలవాటు లేదు. కొనే అలవాటు అంతకన్నా లేదు. అధవా ఏ మిత్రుడి చేతిలోంచో యధాలాపంగా పుచ్చుకుని తిరగేసినా, వారఫలాల పేజీలోని వృశ్చిక రాశిని ఓసారిచదివి 'ఏడిశారు చవటలు చూశావుటోయ్ ! ఓసారేమయిందనుకున్నావు ? నా రాశికి అగ్నిభయం అంటూ నాలుగు వారాలు భయపెట్టేశారనుకో ! అన్ని రోజులు కనీసం నిప్పు సెగకూడా కొట్టలేదోయ్ నాకు ! బ్రహ్మాండమయిన అదృష్టవారం అని రాసిన రోజున మాత్రం నీళ్ళపొయ్యి దగ్గర నా పంచె కాస్త కాలిపోయింది. దీనికేమంటావు?' అంటూ ఆ మిత్రుడిని సవాలు చేశేవారు.

ఆ మిత్రుడు వెర్రినవ్వు నవ్వి తల గోక్కుంటుంటే 'అందుకని ఇలాటివి నమ్మమాకు' అంటూ సలహా చెప్పేవారు

అలా అని ఆయనకి జాతకాలు, జ్యోతిష్యంలాటి వంటే నమ్మకం లేదనుకునేరు. చచ్చేంత భయం, నమ్మకం

ఇంతకీ ఆ రోజున మాస్టారి చేతిలో వున్న వారపత్రిక ఆయన కొన్నది కానే కాదు. తన కూతురి పెళ్ళి కుదిర్చిన మధ్యవర్తిని బస్సెక్కించటానికి వెళ్ళినప్పుడు ఆ మధ్యవర్తిగారి చేతిలో ఓ పత్రిక వుంది. ఆ పెద్దమనిషిగారికి ఓ అలవాటుంది. చేతిలోఉన్న పుస్తకాల్ని, కాయితాల్ని గొట్టంలాగా చుట్టి, దాంతో ఎదుటివాళ్ళని మాటిమాటికి పొడుస్తూ, 'చూశావుటోయ్, విన్నావుటోయ్,అంటూ మాట్లాడటం!

మాస్టారు అప్పటికే చాలాసార్లు ఆయన చేతిలోని పుస్తకంతో పోట్లు తిన్నవారై, చల్లగా ఆయన చేతిలోంచి ఆ పత్రికని లాక్కుని, ఆయన దృష్టిని మాటల మీదకి మళ్ళించబోతుండగా మహారధంలాగా ఆకిరిపల్లి పోయే బస్సు వచ్చి ఆగటం, ఆ పెద్దమనిషి చెంగున గంతేసి బస్సెక్కి శలవు పుచ్చుకోవటం, పత్రిక మాస్టారి చేతిలో మిగిలిపోవటం, బస్సు దడదడలాడుతూ వెళ్ళిపోవటం అన్నీ క్షణాల్లో జరిగిపోయాయి మాస్టారు తప్పనిసరిగ ఆ పత్రికని ఇంటికి తెచ్చుకున్నారు.

ఆ రోజు వెంకటరత్నం మాస్టారికి మహా సంతోషంగా వుంది. కాళ్ళు బలపాలు కట్టేట్టుగా రెండేళ్ళుగా తిరుగుతున్నా కాని పని ఈ రోజుతో పూర్తయింది. తను కూతురికి త్వరలోనే పెళ్లి చెయ్యబోతాడు. అందునా ఇంత బేషయిన సంబంధం దొరకటం ఎంత అదృష్టవనీ! ఉప్పొంగిపోతూన్న వరద గోదారిలా ఇంటికొచ్చిన మాస్టారు ఆ సంతోషంలో ప్రైవేటుకొచ్చిన పిల్లలందరికీ శలవిచ్చేసి ఇళ్ళకి పంపేశారు. వరండాలో నులకమంచం వాల్చుకుని దానిమీద చిద్విలాసంగా పవ్వళించి వుషారుగా పత్రిక తిరగేస్తూ 'ఓయ్ సుబ్బమ్మా! మాకేవయినా కాఫీ నీళ్ళ ప్రాప్తంవుందా ఈ రోజు ?' అంటూ ఇంట్లోకి ఓ కేకవేశాడు.

సుబ్బమ్మగారు ఆవిడ సామ్రాజ్య పరిధులు దాటి వరండాలో కడుగు బెడుతూ 'ఎప్పుడొచ్చారు ? ఇంతకీ ఏవన్నాడు వెంకట్రామయ్యగారు?' అంటూ భర్తని ప్రశ్నించింది

ఆవిడ ఆ మాత్రంగా ప్రశ్నించటమే మహాభాగ్యం! సాధారణంగా ఆవిడకి, మాస్టారికి జరిగే సంభాషణ వంట ఇంటి పరిధిని దాటి రాదు.

'ఏంచెయ్యమంటారు ? వంకాయలు వేయించనా? అల్లం వెయ్యనా?' అంటుందావిడ.

'ఏదో ఒకటి ఏడు' అంటారాయన.

'బియ్యం అడుగంటినాయండీ ?' అంటుందావిడ.

'తిండి మానెయ్యండి' అంటా రాయన.

'ఇదేం అన్యాయం!' అంటూందావిడ బుగ్గలు నొక్కుకుంటూ.

'అవంతే, చావండి' అంటూ లేచి పోతారాయన.

ఆవిడకి పిల్లల చదువులు, బట్టలు, వాళ్ళ బాగోగులు ఆలోచించే తీరిక, ఓపిక, ఆసక్తి, అలవాటులేదు. ఇంట్లో వున్న పదిమంది పొట్టలు రెండు పూటలా ఎలా నింపటమా అన్నదే ఆవిడ ధ్యేయం.

'అలాటి సుబ్బమ్మగారు ఇలా కూతురి పెళ్ళిసంగతి ఆత్రంగా ప్రశ్నించటం ఆయనకి సంతోషంగానూ, ఆశ్చర్యంగానూ అనిపించి 'ఈ జెర్రి గొడ్డుకికూడా తెలివొస్తున్నట్టుందే!' అనుకుంటూ చెప్తాగానీ, కాస్త కాఫీ కషాయం పారబొయ్యి నా మొహాన' అంటూ పత్రిక తెరిచారాయన.

ఆ సంతోషంలో ఆయన జీవితంలో ఎన్నడూ చెయ్యని పని చేశారు. వారఫలాల పేజీ తిప్పకుండానే ప్రథమంగా కనపడ్డ ఓ కథని చదవటం మొదలు పెట్టాడు. ఏకబిగిని చదివి తేలుకుట్టినట్టుగా మంచంమీద లేచి కూర్చుని, కూర్చునే కుదురు లేనట్టుగా తిరిగి మంచం మీదకి వాలి విరిగిపోయిన పెంకుటివసారా దూలాలని చూస్తూ ఆలోచనలో మునిగిపోయాడు. హేట్స్ ఆఫ్ టు ది రైటర్స్!!!

ఆ కథ పేరు 'ఒకానొక సీత కథ'. ఆ సీత ఓ పేద బడిపంతులు అరడజను మంది ఆడసంతానంలో ప్రథమపుత్రిక. అంతగా చదువు సంధ్యల్లేని ఆ మేష్టారి పుత్రికఅయిన సీతమ్మ తండ్రికోసం ఇంటికొచ్చే కుర్రాళ్ళలో, ఓ మంచి పిల్లగాడికి మనసు పారేసుకుంటుంది మౌనంగా. తండ్రి తాహతు లేక నలుగురు బిడ్డలున్న ఓ రెండో పెళ్ళివాడికి కట్టబెట్టటానికి సిద్ధపడతాడు. కాబోయే భర్త క్రూరత్వాన్ని, రాక్షసత్వాన్ని ఆనోటా ఆనోటా కథలు కథలుగా విన్న సీతమ్మ బేజారెత్తిపోయి, తెగించి తనని ప్రేమించాడనుకున్న కుర్రాడితో విశాల ప్రపంచంలోకి రెక్కలొచ్చిన పక్షిలాగా ఎగిరిపోతుంది. రూలు ప్రకారం ఆ కుర్ర ప్రేమికుడు మోజు తీరగానే సీతని ఓ వ్యభిచార గృహానికి దత్తంచేసి మాయమయిపోతాడు. ఆ సీతమ్మ కుములుతూ, కుళ్ళుతూ, వళ్ళమ్ముకుంటూ, మంచి మనసున్న వెద్దదానిలాగా బతికేస్తూ వుంటుంది.

రచయిత తన పదజాల మహేంద్ర జాలంతో సీత జీవితాన్ని ఎంత భీభత్సంగా చిత్రించగలడో అంతగానూ కృతకృత్యుడయ్యాడు.

అప్పటివరకు వెంకటరత్నంగారికి బడిపంతుళ్ళ జీవితం అంత దరిద్రంగానూ, అంత భయంకరంగానూ వుండవచ్చన్న వూహే లేదు. ఆయన గుండెలు దడదడ లాడిపోయాయి. శరీరం చెమటలు క్రమ్మి, గజగజ వణికిపోతూ హార్ట్ఎటాక్ వచ్చిన మనిషిలా అయ్యాడు. అప్రయత్నంగానే ఆయన కథలోని బడిపంతులు జీవితంతో తన జీవితాన్ని పోల్చుకోవటం మొదలు పెట్టాడు. వెంకటరత్నంగారు వెనక ఆధారంలేని బహు కుటుంబీకుడు. నలుగు రాడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు, తల చెడిన అప్పగారు, తలితండ్రుల్లేని అన్నగారి కొడుకు – ఇంతమంది నోళ్లు ఆయన సంపాదనమీద నిండవు. సాధ్యమయినంతమంది ప్రైవేటు కుర్రాళ్లని పోగుచేసి వాళ్లమీదొచ్చే రాబడితో బ్రతుకుబండిని ఈడుస్తున్నారు. సుబ్బమ్మగారు అయోమయంది. తల చెడిన అప్పగారు నోటిదురుసు మనిషి. రాధ పెద్దకూతురు. హైస్కూలు చదువు పూర్తిచేసి పెళ్లికి ఎదిగొచ్చి మూడేళ్లవుతోంది.

ఎన్ని సంబంధాలు చూసినా రాధకి కట్నాల దగ్గర బెసికిపోతోంది. గంతకి తగ్గ బొంతలు కూడా గగనమయిపోతున్నారు. చిట్టచివరికి ఆకిరిపల్లి సంబంధం కుదిరేసరికి ఆయన బ్రహ్మాండాన్ని జయించినంతగా పొంగిపోయారు. పెళ్లికొడుకు పిల్లల్లేని రెండో పెళ్లివాడు. పెళ్లయిన మూడేళ్లకే భార్య పోయింది. నాలుగేళ్లు గప్‌చుప్‌గా వూరుకుని మళ్లీ పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నాడు. రాధ నచ్చింది. కట్నం లేకుండా చేసుకోవటానికి ఒప్పుకున్నాడు. అదే మాస్టారి సంతోషానికి ముఖ్య కారణం.

కానీ ఈ 'ఒకానొక సీత కథ' చదివే వరకు మాస్టారి బుర్రలో రాధ ఎవర్నయినా ప్రేమించి వుండొచ్చునని గానీ, అదీ తన యింటికొచ్చే కుర్రాళ్లలో ఒకరయి వుండచ్చునని గానీ, ఈ రెండో పెళ్లి సంబంధం రాధకి సుతరామూ ఇష్టంవుండి వుండకపోవచ్చునని గానీ తట్టలేదు. ఆ ఆలోచన వచ్చిన మరుక్షణమే ఆయన చలిజ్వరం వచ్చిన మనిషిలా వణికిపోయాడు.

ఎవరై వుండవచ్చుఆకుర్రాడు? రాధ ప్రేమించడమంటూ జరిగితే తన ఇంటికొచ్చేవాళ్లల్లో ఎవరో ఒకరయి వుండాలి? ఆయన మనసులో తన శిష్యులంతా ఒక్కసారి వరసగా కదిలారు. ఛా ఛా, వీళ్లెవరూ కాదు. అంతా గడ్డం మీసంరాని కుర్రకుంకలేను. హఠాత్తుగా ప్రభాకరం గుర్తొచ్చాడు. అవును! తప్పకుండా వాడే అయివుండాలి! ఆయన కనుక్కోలేంది చేతికి చిక్కినట్టుగా చప్పున లేచి కూర్చున్నాడు.

ప్రభాకరం బి.ఎ. పేసయి వుద్యోగం వేటలో వున్నాడు. ఓ ఫ్రెండుతో కలిసి

ఓ రూములో వుంటున్నాడు. వెంకట రత్నంగారికి రంగనాథస్వామి కోవెల్లో పరిచయం అయ్యాడు. అప్పుడప్పుడు ఇంటికి వచ్చేవాడు. మాస్టారు పొద్దున, సాయంత్రం పిల్లలతో నతమతమవు తూండటం చూసి తనకి వుద్యోగం దొరికేవరకు ఉబుసుపోకగా మాస్టారికి సహాయంగా పిల్లలకి చదువు చెప్తా నన్నాడు. మాస్టారు సంతోషంగా అంగీకరించారు. కాస్త ఊపిరి పీల్చుకునే సమయం చిక్కిందాయనకి. ప్రభాకరం రోజూ పిల్లల ప్రైవేటు వేళకి మాస్టా రింటికి వచ్చేవాడు. పిల్లలతో బాటుగా తనూ వెళ్లిపోయేవాడు. కానీ ప్రభాకరం రాధలమధ్య ఎలాటి పరిచయం వున్నట్టు ఆయనకి ఎప్పుడూ అనిపించలేదు. ఈ సారి జాగ్రత్తగా గమనించాలి అనుకున్నారాయన.

సుబ్బమ్మగారు పావుశేరు ఇత్తడి గ్లాసులో సగానికి నీళ్లకాఫీ తీసుకొచ్చి భర్త కిచ్చింది.


'రాధేది?' అన్నారాయన కాఫీ గ్లాసందుకుంటూ.

'వరలక్ష్మ్మ గారింటికి వెళ్లింది కృష్ణవేణి కోసరం' అందావిడ.

ఆయన తాగుతున్న కాఫీగ్లాసుని చప్పున కిందకి దాచి సుబ్బమ్మగారి వైపు సాలోచనగా చూశారు. ఆ వర లక్ష్మ్మగారింట్లోనే ప్రభాకరం అద్దె కుంటున్నాడు స్నేహితుడితో కలిసి! ఆయన మనసులో పడ్డ విత్తనం మొల కెత్తటం మొదలయింది.

* * *

మరునాడు ప్రభాకరం వచ్చిన దగ్గ ర్నుంచీ వెంకటరత్నగారు అతన్ని ఓరగా గమనిస్తూనే వున్నారు. ప్రభా కరం వరండాలో కిటికీ దగ్గరగా కూర్చుంటాడు. అతను మధ్యలో ఓసారి కిటికీ వైపు తిరిగి మాట్లాడిన ట్టనిపిం చింది వెంకటరత్నంగారికి. ఇంతలోనే




రాధ ఓ గ్లాసు మంచినీళ్లు తీసుకొచ్చి ప్రభాకరాని కిచ్చింది. అతను అందుకుంటూ మెల్లగా ఏదో అన్నాడు. రాధ మెల్లగా నవ్వింది. అతను తాగేవరకు నిలబడి గ్లాసందుకుని లోపలికి వెళ్లింది.

నిజానికి రాధకి, ప్రభాకరానికి మధ్య వెంకటరత్నంగా రూహించినటువంటి పరిచయంలేదు. ఆంధ్రప్రదేశం లోని లక్షలాది ఆడపిల్లల్లాగే రాధకూడా అన్ని పత్రికలూ, పుస్తకాలు స్నేహితుల దగ్గర్నించి పట్టుకొచ్చి ఏకబిగిని చదివి అవతల పడేస్తుంది. చదివిన వాటిల్లో ఒక్కటికూడా ఆ బుర్రలోకి గాఢంగా ఎక్కవు. నిలవ్వుండవు. నవ్వొచ్చే జోక్సుంటే మాత్రం చెల్లెళ్లకి, తమ్ముళ్లకి చెపుతూ వుంటుంది.

ఆ పిల్లకి ఆకాశానికి ఎగరాలన్న కోరికలు లేవు. రాధ అతిసామాన్యమయిన ఆడపిల్ల. పెళ్లిగురించి ఓ నిశ్చితాభిప్రాయంగానీ, ఉద్దేశాలుగానీ లేవు, నలుగురాడపిల్లల్లాగా పెళ్లి జరిగితే చాలనుకుంటుంది. ఆ వచ్చే మొగుడు తన్ని ఆకలితో పస్తులు పడుకోబెట్టకుండా, తిండి పెట్టగలవాడయితే సంతోషమే. తను కోరిన చీర కొనగలవాడో, సినిమా చూపించగలవాడో అయితే, మహాభాగ్యమే! రాధ ఆలోచనలు అంతవరకే నడుస్తాయి.

తండ్రి తన పెళ్ళికోసరం చాలా శ్రమపడుతున్నారని తెలుసు. తనని చూసిపోయిన డజను సంబంధాలు తప్పిపోయినప్పుడు తనకి ఎవడో ఒకడితో త్వరగా పెళ్లయి ఈ ఊబిలోంచి బయట పడితే చాలనుకుంది. తను వుస్తె కట్టించుకుని ఇంట్లోంచి బయటికిపోతే తప్ప తన వాళ్లు విశ్రాంతిగా ఊపిరి పీల్చుకోరని కూడా ఎప్పుడో పసిగట్టింది.

ఆకిరిపల్లి పెళ్ళికొడుకు వచ్చి చూసినప్పుడు కూడా ఆ పిల్లకి అతని కిది రెండోపెళ్ళి అన్న విషయం బుర్రలో మెదల్లేదు. ఇంట్లోవా శ్లైవరూ అదో విశేషంగా చెప్పుకోకపోవడమే అందుకు కారణం. చూడవచ్చిన పెళ్ళికొడుకు భారీగా వుండి కాయకష్టానికి అలవాటు పడ్డవాడిలా కనిపించాడు అతను వేసుకున్న పేంటు షర్టులో ఫేన్సీడ్రెస్ వేసుకున్నవాడిలా కనిపించాడు. అంతకంటె పంచె కట్టుకుని లాల్చీ వేసుకుంటేనే అతనికి నప్పుతోందేమో ననిపించింది రాధకి.

ఇంట్లోవాళ్ళంతా ఆ సంబంధాన్ని రాధ మనసుమీద ఇంప్రెస్ చెయ్యటానికి చెయ్యదగ్గ ప్రయత్నాలన్నీ చేశారు.

'కుర్రాడికేం! చిదిమి దీపం పెట్ట

వచ్చు. మహా వుంటే ముప్పై కూడా దాటవు' అంది రాధ మేనత్త.

'ఆరెకరాల పొలంట! పాడి గొడ్లుట! లంకంత పెంకు టిల్లుందిట!' అంది సుబ్బమ్మగారు సంబరంగా.

'అసలీ రోజుల్లో ముప్పైదాటని పెళ్ళి కొడు కెవ్వరో చూపించు' అంటూ ఛాలెంజి చేశారు వెంకటరత్నంగారు.

'కాస్త ముదురుగా కనిపిస్తాడు గానీ అంత వయసెక్కడండీ కుర్రాడికి! మా పెద్దవాడికంటే పదేళ్ళేగా పెద్ద!' అన్నాడు మధ్యవర్తి.

'అత్త పోరు లేనట్టే! ముసిల్ది ఓమూల పడుంటుంది, కళ్ళు కాళ్ళు ఆనవు. మరుదులు, ఆడబిడ్డలు ఎవరి సంసారాలు వాళ్ళవిట,' అంది మేనత్త. 'నా తల్లి అదృష్టవంతురాలు. పాడీ పంట, ఇల్లు పొలం, అబ్బ అబ్బ' అంటూ మేనత్త మెటికలు విరిచి రాధగడ్డం పుణికి ముద్దు పెట్టుకున్నప్పుడు, ఆ పిల్ల నిజంగానే సంతోషపడింది.

రాధ స్నేహితురాళ్ళమధ్య కూడా ఆ పెళ్ళిని గురించిన చర్చ జరిగింది. 'ఏవే రాధా, పెళ్ళికూతురి వయ్యావుట గదే' అంది కృష్ణవేణి. 'రెండో పెళ్ళిట గదే అతగాడికి?' అంది ఆరాగా పంకజం.

'అయితే మాత్రం ఏంలెద్దూ! కోలెడంత ఆస్తిపాస్తు లున్నాయిట. మా రాధమ్మ జమిందారిణీ కాబోతోంది'అంది అనసూయ ఆట పట్టిస్తూ.

'ఇంతకీ పెళ్ళికొడుకు ఎలావున్నాడో చెప్పవే రాధా' అం అంట్లూతా ఆ పిల్లని వేధించుకు తిన్నారు. 'వచ్చి చూడక పోయారూ?' అంది రాధ.

'అబ్బో, అబ్బో అప్పుడే ఎంత వెన కేసుకొస్తోందో చూడవే' అంది అనసూయ.

రాధ సిగ్గుపడింది. రాధ పెళ్ళికొడుకుని గురించి చెప్పేవరకు వదల్లేదు స్నేహితురాళ్ళు.

'బాగానే వుంటా...' అంటూ చివరి మాటలు మింగేసింది. రాధ వున్నాదనాలో, వుంటారనాలో తెలియక అంతా నవ్వేశారు

రాధ వినకుండా కృష్ణవేణి అనసూయతో అన్నమాటలు కూడా రాధ చెవిలో పడ్డాయి. 'బాగా పెద్దవాడుటే! మా నాన్నగారు చెప్పారు ఆ వూళ్ళో ఎవర్నో ఉంచుకున్నాట్ట! ముసలితల్లి పోరుపడలేక పెళ్ళి చేసుకుంటున్నాట్ట' అంది కృష్ణవేణి రహస్యంగా.

రాధమీద ఈ మాటలు అంతగా పని చెయ్యలేదు. 'కుదిరిన పెళ్ళిళ్ళు చెడగొట్టటానికి లక్షమంది కాసుక్కూర్చుంటారు' అంటూ తల్లీ, మేనత్త పదేపదే అనుకునే మాటలు రాధ మనసుమీద గట్టిగా నాటుకున్నాయి.

ప్రభాకరం అప్పుడప్పుడు మంచినీళ్ల అడిగితే రాధ తెచ్చిచ్చేది అతను అందుకుని 'థేంక్స్' అనేవాడు. రాధ నవ్వి గ్లాసు తీసుకుని వెళ్ళేది. ఇవాళ అదే జరిగింది. ఈ సంఘటనని వెంకటరత్నంగారు మరో దృష్టిలో చూడటం ఇద్దరికీ తెలియదు.

మరో గంటసేపయ్యాక వెంకటరత్నంగారు లోపలిగదిలోకి వచ్చినప్పుడు రాధ వొళ్లో పత్రిక పెట్టుకుని కిటికీలోంచి బయటికి చూస్తోంది. కిటికీ బయట కూర్చుని ప్రభాకరం పిల్లలకి పాఠాలు చెపుతున్నాడు. వెంకటరత్నంగారికి గట్టి రుజువు దొరికినట్టయింది.

'ఏమిటా దీర్ఘాలోచన? పో లోపలికి' అంటూ కసిరాడు. తను వెళ్ళబోయే పల్లెటూరు, ఇల్లు, పొలాలు, కొత్త మనుషుల్ని వూహించుకుంటున్న రాధ తుళ్ళిపడి తండ్రి కోపానికి ఆశ్చర్యపోతూ అయోమయంగా చూసింది.

మరునాడు వెంకటరత్నంగారు స్కూలునుంచి వచ్చేసరికి రాధ ఇంట్లో లేదు. కృష్ణవేణి ఇంటికి వెళ్ళిందని చెప్పింది సుబ్బమ్మగారు. ఏదో ఘోరం జరుగుతున్నట్టుగా బంగారువడ్డాడు వెంకటరత్నంగారు. వుద్యోగం సద్యోగం లేని ప్రభాకరంగాడు రూములోనే వుండివుంటాడు. అందుకే ఇది పోయుంటుంది అనుకున్నారాయన కోపంగా.

ఇంతలోనే ప్రైవేటు పిల్లలు రావటం, ఆ వెనగ్గా ప్రభాకరం రావటం, ఆపైన మరో పావుగంటకి రాధ ఇంటికి రావటం చూసి, 'అంతా నాటకం' అంటూ పళ్లు కొరుక్కున్నారు. గుండె దడదడలాడటం మొదలయింది. ఇహ వీళ్ళిద్దరూ లేచిపోవడమే తరువాయి అనుకోసాగారు పళ్లు నూరుతూ.

ప్రభాకరం వెడుతూ వెడుతూ తను చదివేసితెచ్చిన పత్రికని రాధని కేకేసి ఇచ్చిపోయాడు. వెంకటరత్నంగారు చూడనే చూశారు.

'ఏవిటీ? వాడితో కబుర్లు? ఆ? ! ఏం పుస్తకాలవి? ఇటుతే?' అంటూ రాధ చేతిలోంచి పుస్తకాలు లాక్కున్నాడు. రాధ బిత్తరపోయి చూసింది.

వెంకటరత్నంగారు పుస్తకాల్ని పేజీ, పేజీ చొప్పున గాలించి కింద పారేశారు. ఆయనకి ఋజువులు, సాక్ష్యాలు ఏవీ దొరకలేదు. గడుసువాళ్ళు. అంత తేలిగ్గా దొరికిపోతారా?' అనుకున్నారాయన.

వెంకటరత్నంగారు మరో మహాపరాధం చేశారు. ఆయన ఆరాత్రి భార్యని భావిగట్టు దగ్గరికి పిల్చి, 'ఏమే! రాధ ఆ ప్రభాకరంగాడిని ప్రేమిస్తున్నసంగతి నీ కేవయినా తెలుసా?' అన్నాడు.

నిజానికి సుబ్బమ్మగారికి ఈ ప్రేమించుకోవటం లాంటి పదాలకు అసలర్థం తెలియదు. కనీసం సినిమాలు గూడా చూడదావిడ. ఆవకాయకి ఎంత ఉప్పు, ఎంత కారం పొయ్యాలో, అప్పడాల్లో ఎంత ఇంగువ వెయ్యాలో ఇలాటివి అడుగుతే క్షణాల్లో గటగట చదివేస్తూందావిడ. భర్త అడిగిన ప్రశ్న

ఆవిడకి తప్పున అర్థంకాక 'ఏవిటి మీరనేది? ' అందావిడ వేలుముడి సరిజేసుకుంటూ.

'మన రాధ, ఆ ప్రభాకరంగాడు ప్రేమించుకుంటున్నారా అంటున్నా? అదే ఒహాళ్ళంటే ఒహాళ్ళకి ఇష్టమేనా అంటున్నా వెర్రి మొహమా?' అన్నారాయన విసుగ్గా ప్రేమని అంతగా వివరించి చెప్పడం ఇష్టంలేక.

'అయ్యో, అట్టా ఎందుకవుతుందండీ! అయినా మన రాధకి పెళ్ళి కుదిరిందిగా' అందావిడ. వెంకటరత్నంగారికి నవ్వాలో ఏడవాలో తెలియక తలబాదుకుని 'ఫో లోపలికి అడివి మొహమా! దాన్ని ఓ కంట కనిపెట్టి వుండు' అన్నారాయన. ఆవిడతో అంతకు మించి ఏంచెప్పినా ప్రయోజనం వుండదని తెలుసాయనకి.


ఆ మర్నాడు సుబ్బమ్మగారు రాధని పొయిదగ్గరికి పిల్చి 'ఏవే రాధా! నువ్వా ప్రభాకరాన్ని ప్రేమిస్తున్నావటగా? నిజమేనా?' అందావిడ.

రాధ తెల్లబోయి చూస్తూ నిలబడి, మెల్లగా తేరుకుని 'ఎవరన్నారు?' అంది మెల్లగా.

'ఏవరేవిటి? మీ నాన్నే. నిన్నోకంట కనిపెట్టి వుండమన్నారు' అని కూడా అందావిడ.

రాధకి మిస్టరీ మెల్లమెల్లగా అర్థం కాసాగింది. తను వరండాలోకి వెళ్ళినా, ప్రభాకరం వున్న పరిసరాల్లోకి వెళ్ళినా తండ్రి విసుక్కోవటం, కోపగించుకోవటంలో గల అర్థం బోధపడసాగింది. కానీ తండ్రికి అలాటి అభిప్రాయం ఎలా కలిగిందో మాత్రం తెలియలా. కానీ ఈ సంఘటన ఫలితంగా ప్రభాకరం రాధ దృష్టిని పూర్తిగా ఆక్రమించుకున్నాడు.

ఆ సాయంత్రం ప్రభాకరం వచ్చినప్పుడు రాధ కిటికీ గుండా అతన్ని పరీక్షగా చూసింది. పచ్చగా, సన్నగా మధ్యస్తంగా వున్నాడు. దువ్వినక్రాపు




తలమీద నిలవకుండా విరుచుకునినుదిటి మీద పడి వింతగా అందంగా వుంది. తెల్లటి మొహం మీద చెవులకిందుగా పెరిగిన చెంపలు షోగ్గా వున్నాయనిపించింది. అప్రయత్నంగారాధమనసులో ఆకిరిపల్లి పెళ్ళికొడుకు మెదిలాడు. పొడుగ్గా, లావుగా, పొట్టి క్రాపు, నల్లటి పెదాలతో మహామోటుగా అనిపించాడు. హఠాత్తుగా రాధకి కృష్ణవేణి అనసూయతో అన్న మాటలు గుర్తుకొచ్చినాయి. ఎవర్నో అట్టిపెట్టుకున్నాడన్న సంగతి ముసలయ్య పోరు పడలేక తన్ని పెళ్ళి చేసుకుంటున్నాడన్నవిషయమును. మొట్టమొదటిసారిగా రాధకి కాబోయే భర్తమీద, ఆసంబంధం మీద అయిష్టంఏర్పడింది. అక్కడ్నించి ఆ పిల్ల మనసు జెట్ వేగంలో పని చెయ్యటం మొదలయింది. అందరూ కలిసి తనకి మహాఅన్యాయం చేయబోతున్నట్టు, దాన్నెలాగయినా తను ప్రతిఘటించి తప్పించుకోవాలన్న ఉబలాటం తొందరపెట్టటం మొదలయింది.

మర్నాడు తండ్రి బడినుంచి వచ్చేసరికి ఆలస్యమయింది. ప్రభాకరం పిల్లల హోమ్‌వర్క్ చెక్ చేస్తున్నాడు. రాధ అందంగా తల దువ్వుకుని, కాటిక దిద్దుకుని, జడ ముందేసుకుని గుమ్మంలో నిలబడి, 'పత్రికరాలేదా?' అంది మెల్లగా ప్రభాకరానికి ఆ మాటలు వినపడలేదు. తన ధోరణిలో తనున్నాడు.

'అరే! పిలుస్తుంటే పలకరేం!' అంది రాధ చిరునవ్వుతో. రాధ గొంతు పలికిన తీరుకి ప్రభాకరం తలెత్తి ఆశ్చర్యంగా రాధవైపు చూశాడు. విలాసంగా ఎగురుతున్న పవిట, కాటుక కళ్ళు, పొడవాటి జడ, వంపు తిరిగిన పెదవులు ప్రభాకరాన్ని చూసి వక్కున నవ్వాయి.

రాధ ఆ తీరున ప్రభాకరంతో మాట్లాడటంఆదేప్రథమం. అతడు చటుక్కున దృష్టిమరల్చుకుని 'ఏవిటీ?' అన్నాడు. తత్తరగా.

ప్రభాకరానికి మాత్రమే వినపడేట్టుగా మెల్లగా నవ్వి 'పత్రిక రాలేదా అంటున్నాను' అంది. ఆ మాటల్లోని చనువు ప్రభాకరాన్ని ఎక్కడెక్కడికో లాక్కుపోయింది.

'వచ్చింది. రేపుతెచ్చిస్తాను అన్నాడు రాధని పరీక్షగా చూస్తూ.

'కాస్సేపయ్యాక అటుకేసి వస్తాను ఇస్తారా?' అంది. ప్రభాకరం మరింత ఆశ్చర్యాన్నికళ్ళల్లో కనపడనీయకుండా జాగ్రత్తపడ్డాడు. రాధెప్పుడూ అతని రూముకిరాలేదుఇంతవరకు. అసలుఇన్ని మాటలు మాట్లాడిందే అరుదు! రాధ కొత్తగా, వింతగా కనిపించింది అతని కళ్ళకి.

సరిగ్గా ఇలాటి సమయంలోనే వెంకటరత్నంగారు వీధితడికతీసుకుని లోపలికి వచ్చారు. గుమ్మందగ్గర నిలబడ్డ రాధని వెర్రివాడిలాగా రాధవైపే చూస్తూ మాట్లాడుతున్న ప్రభాకరాన్ని చూసి ఆయన గుండె ఆగినంత పనయింది. 'అమ్మయ్యా! ఎన్నాళ్ళుగా సాగుతోందో ఈ గ్రంథం.' అనుకుంటూ గట్టిగా అడుగులేస్తూ సకిలిస్తూ లోపలికొచ్చారు.

రాధ చటుక్కున లోపలికి మాయమయింది. ప్రభాకరం తలవంచుకుని పుస్తకంవైపు దృష్టి మరల్చాడు.

వెంకటరత్నంగారు ఇవాళ మరో ఘనకార్యం చేశారు. వస్తూ, వస్తూ అర్ధ రూపాయి వెచ్చించి వారపత్రిక కొనుక్కొచ్చారు. బహుశా మరో 'ఒకానొక సీతకథ' లాటిది వుండవచ్చునేమో!

రాధ తల్లితో కూడా చెప్పకుండా కృష్ణవేణి వాళ్ళింటికివెళ్ళి కాసేపుకూచుని వాళ్ళింటి పెరట్లోవున్న ప్రభాకరం గదికి వెళ్ళింది. ప్రభాకరం అతని స్నేహితుడు ఇద్దరూ గదిలోనే వున్నారు. గుమ్మంలో చిరునవ్వుతో నిలబడ్డ ఆడపిల్లని చూసి ఇద్దరూ తత్తర పడ్డారు. రాధ వాళ్ళ అవస్థ గమనించి పెదిమలు ముడిచిపెట్టి నవ్వుతూ 'పత్రిక ఇస్తారా?' అంది.

ప్రభాకరం టేబిలుమీదవున్న పత్రిక రాధకి అందిస్తూ ఏం మాట్లాడాలో తెలియక ఓ నవ్వు నవ్వాడు.

రాధ వెనక్కి తిరిగి, అందమయిన చిరునవ్వు ప్రభాకరంమీద విసిరి మాయమయింది. హిప్నటైజ్ చేయబడ్డవాడిలాగ నిలబడి చూస్తున్న ప్రభాకరం వెనకనించి వంగి, 'ఏరోయ్ ఎక్కడో పిట్టను పట్టావే!' అన్నాడు స్నేహితుడు. ప్రభాకరం ఈ లోకంలో పడి చెర్రుమన్నాడు. 'నోరుముయ్! కనపడ్డ ఆడపిల్లనల్లా అలా తేలిగ్గా మాట్లాడకు వెధవాయ్' అంటూ కసురుకున్నాడు.

వెంకటరత్నంగారు కొన్న పత్రికలో 'ఒకానొక ఓ సీత కథ' లాటి కథయితే లేదుగానీ, దాన్ని మించిన ఘోరమయిన వార్త మరోటి కనపడింది. ఎక్కడో, ఎవరో పనీపాట లేనివాళ్ళు జనాభా లెక్కలు తీయగా తేలిన విశేషమేవంటే పెళ్ళికాని యువతులు, నూటికి ఎనభై మందో, తొంభై మందో పెళ్ళికాక ముందే భర్తగాని మరో మనిషితో సంబంధం వుందని అంగీకరించారట! ఈ వార్త వెంకటరత్నంగారి గుండెలమీద,టన్నుంబావు క్వార్టర్ ఇనుపగుండులా దిగింది. ఆయన గుండెలు దడదడ రైలు ఇంజనులా చప్పుడు చెయ్యడం మొదలు పెట్టాయి. పనిలేని వెధవలకి ఇలాటి సమాచారాలు సేకరించటం తప్ప మరో పనిలేదా అని తిట్టుకున్నా ఆయన గుండె దడ తగ్గలేదు!

ఏమో! ఎవరు చెప్పొచ్చారు! ఆ ఎనభై మందిలో రాధ ఒకత్తి కాదని ఋజువేముంది. అదే జరిగిన పక్షంలో ఎంత అప్రతిష్ట! అదీ పెళ్ళి కుదిరిన పిల్లకి! ఆయన అసహ్యంగా, కోపంగా చేతిలోని పుస్తకాన్ని విసిరికొట్టారు. అప్పుడే ప్రభాకరం గదినుంచి వస్తున్న రాధ, కాళ్ళ దగ్గర వచ్చిపడ్డ పుస్తకాన్ని ఆశ్చర్యంగా చూస్తూ, వంగి తీసి తండ్రి వైపు చూసింది. వెంకటరత్నంగారు ఎవరో కొత్త మనిషిని చూస్తున్నట్టుగా రాధని చూడసాగారు కళ్ళు పెద్దవి చేసి. ఏం జరిగిందో అర్థంకాక రాధ లోపలికి వెళ్ళిపోయింది.

చటుక్కున వెంకటరత్నంగారికి రాధకి కాస్త బోధచెయ్యటం మంచిదని పించింది. ఎంతయినా రాధ చిన్నది. ప్రపంచజ్ఞానం లేని అమాయకురాలు. "చూడమ్మా రాధా! ఆ ప్రభాకరం అంటే నువ్వేదో మోజులో వున్నట్టున్నావు. ప్రేమా గీమా అంటూ అయోమయంలో పడకు. ఆ ప్రభాకరం నిన్ను పెళ్ళి చేసుకుంటున్నా దనుకుంటున్నావేమో! అతగాడికి పిల్ల కుదిరిపోయి రెడీగా వుంది. నువ్వేదయినాఅఘాయిత్యంగానీ చేశావో నిన్ను నట్టేట్లోముంచి పరారయిపోతాడు జాగ్రత్త!" అని చెప్పాలనుకున్నారాయన.

కానీ రాధని పిల్చి ఆయన చెప్పాలనుకున్నది వేరు. చెప్పింది వేరు.'రాధా చూడమ్మా పైనెల్లో ముహూర్తాలు పెట్టుకుంటున్నాం. నిజంగా నువు అదృష్టవంతురాలివి తల్లీ. నయాపైస కట్నం లేకుండా బ్రహ్మాండమయిన సంబంధం. ఇల్లూ, పొలం, పుట్రా ఇంత మంచి సంబంధం తీసుకురాగలనని నే ననుకోలేదమ్మా అన్నారాయన. చెప్పాలనుకున్నది చెప్పలేకపోయినందుకు తన్ని తనే నిందించుకున్నారు కసిగా. తెలిసిన విషయాలే తండ్రి మళ్ళీ ఎందుకు చెపుతున్నాడో రాధకి అర్థంకాకపోయినా, ఆయన చెప్పలేనిదేదో అర్థమయినట్టే అనిపించింది. మెల్లగా నవ్వుకుందితనలో తనే తండ్రి అవస్థకి.

వెంకటరత్నంగారు ఎందుకయినా మంచిదని ఆ సాయంత్రం ప్రభాకరం ఇంటికి వెళ్ళేటప్పుడు పనివేళాపిలిచి రాధకి కుదిరిన సంబంధం గురించి చెప్పారు. ఆయన వుద్దేశ్యమల్లా రాధకి పెళ్ళి కుదిరిందోయ్ పిచ్చి ప్రభాకరం. నువ్వేమయినా పిచ్చివేషా లెయ్యాలనుకుంటున్నావేమో జాగ్రత్త వొళ్లు దగ్గర పెట్టుకుని మసలుకో' అని చెప్పాలని మాత్రమే అయన వుద్దేశ్యం. కానీ ప్రభాకరానికి మాత్రం ఆయన మాటలవల్ల అర్థమయిందిఒక్కటే విషయం. కట్నం ఇవ్వలేక రాధకి తగని రెండో పెళ్లి వాడిని కుదిర్చారు. ఆ లోపాన్ని కప్పిపుచ్చుకోవటానికి వరుడి ఆస్తిపాస్తుల్ని తల్చుకుని తృప్తిపడాలని చూస్తున్నారు అనుకున్నాడు ప్రభాకరం. రాధమీద ఎనలేని జాలిలాంటిది ముంచుకొచ్చింది. తనలో తనకే తెలియని ఏదో ఆవేశం

లాటిది గూడా కలుగుతోందని కని పెట్టాడు ప్రభాకరం.

* * *

ఆ రాత్రి వెంకటరత్నంగారు సుబ్బమ్మగార్ని మళ్ళీ బావి గట్టుదగ్గరకి పిల్చి అడిగారు. 'ఏవే! రాధ ఈ పెళ్ళి చేసుకోననిగానీ అంటుందా యేం? రెండో పెళ్ళివాడని గుణుస్తోందా?' అన్నా రాయన.

'ఎందు కంటుందండీ! నిక్షేపంలాంటి సంబంధం వద్దని! మీతో గాని అన్నదా యేం?' అందావిడ.

వెంకటరత్నం గారికి ఒళ్ళుమండి చిర్రెత్తుకొచ్చి ఆవిడకి జవాబు చెప్ప కుండా, 'ఒహవేళ ఆ ప్రభాకరంగాడు గానీ పెళ్ళిచేసుకుంటాడని ఆశపడుతోం దేమో? వాడొట్టి వెధవ! దగుల్బాజీ! పది వేల కట్నంతో వాడికి మేనమామ కూతురు సిద్ధంగా వుందని నాతో చెప్పాడు. తెలుసా?' అన్నాడాయన కోపంగా. 'వుట్టి అడివి గొడ్డువి. నీకేం తెలియదు' అని కూడా అన్నారు.

సుబ్బమ్మగారు మక్కికి మక్కి వెంకటరత్నంగారి మాటలన్నీ రాధకి చెప్పింది. 'ఏవే రాధా! ఆ ప్రభాకరం నిన్ను పెళ్ళిచేసుకుంటున్నా డనుకుంటు న్నావా యేం? అతగాడికి పదివేల కట్నంతో పిల్ల సిద్ధంగా వుందిట' అందా విడ అమాయకంగా.

రాధ తల్లి మాటలు విని మౌనంగా వూరుకుంది.

ప్రభాకరానికి రోజూ రంగనాధ స్వామి కోవెలకి వెళ్ళి భగవద్దర్శనం చేసు కునే అలవాటుంది. ఆరోజు కను చీకటిగా వున్న వేళ, మంటపంలోంచి ఎవరో వెక్కి వెక్కి ఏడుస్తున్న శబ్దం విని ప్రభాకరం అటువైపుగా వెళ్ళి చూశాడు. రాధ మోకాళ్ళ మీద తలుంచుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది. ప్రభాకరం ఆశ్చర్య పోయాడు. అసందిగ్ధంగా నిలబడి



పోయాడు. రాధ వెక్కిళ్ళు చూసి జాలి ముంచుకొచ్చింది. 'రాధా ఏమిటిది! ఇక్కడ కూర్చుని ఏడుస్తున్నా వేమిటి? ఏం జరిగింది' అంటూ పక్కన నుంచుని ప్రశ్నించాడు.

రాధ జవాబు చెప్పలేదు. ఓసారి తలెత్తి ప్రభాకరాన్ని చూసి తల దించు కుంది. వెక్కిళ్ళు, ఏడుపు మరింత ఉధృతం అయ్యాయి. ప్రభాకరం తట పటాయింపుగానే రాధ భుజంమీద చెయ్యేసి, 'ఏం జరిగిందో చెప్పు రాధా' అన్నాడు అనునయంగా.

రాధ చటుక్కున లేచి నిలబడి ప్రభా కరం చెయ్యిని విదిల్చి, 'నన్ను వదలండి మాస్టారూ. నాలాటి వాళ్ళు చచ్చిపోతేనే నయం' అంటూ పరుగు పెడుతూ మంటపం మెట్లు దిగి మూలగా నున్న కోనేటి వైపు పరుగు తీసింది. ప్రభాకరం స్పృహలో కొచ్చిన వాడిలాగా ఒక్క పరు గున రాధని చేరుకుని చెయ్యి గట్టిగాపట్టి ఆపి, బలవంతాన కోనేటి మెట్లుమీద కూర్చోబెట్టాడు.

'విషయం ఏమిటో చెప్పు రాధా! నేనే మయినా సహాయం చెయ్యగలనేమో చూస్తాను! చచ్చిపోవడం పిరికివాళ్ల లక్షణం తెలుసా' అన్నాడు బుజ్జగింపుగా.

'మరో మార్గం ఏముంది చచ్చిపోక. నేను బతికివుంటే మానాన్న ఆ దరిద్రపు సంబంధం చెయ్యక మానడు. మీ రేం చెయ్యగలరూ?' అంది వెక్కుతూ.

ప్రభాకరం వెంటనే జవాబు చెప్ప లేదు. రాధవైపు, నాచుపట్టిన కోనేటి నీటివైపు మార్చి మార్చి చూస్తూ కూర్చున్నాడు.

"రాధా! నీకు ఇష్టంలేని ఆ పెళ్లి జరక్కుండా నేను చూస్తాను. నువ్వెం కెప్పుడు ఇలాటి పని చెయ్యకు" అన్నాడు చివరికి.

"ఈ సంబంధం కాకపోతే ఇలాటిదే మరొకటి తెస్తాడు మా నాన్న. నన్ను

చచ్చిపోనివ్వండి మాస్టారు. మీ రేం చెయ్యలేరు. మీ దోవన మీరు వెళ్ళండి" అంటూ రాధ కోనేటిమెట్లన్నీ దిగిపోయి అడుగు మెట్టు చేరుకుంది చకచకా. ప్రభాకరం రన్నింగ్ రేసులో లాగా పరుగుపెట్టి రాధ చేతిని పుచ్చుకుని రెండు మెట్లు పైకి లాగాడు బలంగా. రాధ చేయివిడిపించుకోవటానికి తంటాలు పడుతోంది. ఎదురుగా నల్లటి నీళ్ళు చీకట్లో భయంకరంగా నోరు తెరుచుకున్న మృత్యు దేవతలాగా కోనేరు నిశ్చలంగా వుంది."

'రాధా! ఈ పిచ్చి పని మానెయ్యి. నిన్ను నేను పెళ్ళి చేసుకుంటాను సరేనా' అన్నాడు ప్రభాకరం ఆవేశంగా రాధ చేతిని గట్టిగా పట్టుకుంటూ. రాధ నవ్విన నవ్వుకి ప్రభాకరం ఉలిక్కిపడ్డాడు.

"మీరు పదివేల కట్నంతో మేనరికం వున్నప్పుడు ఎందుకు మాస్టారూ నన్నిలా మభ్య పెడతారు!" అంది రాధ నిష్ఠురంగా, జాలిగా.

ఒక్కక్షణం రాధ చేతిమీద ప్రభాకరం చేతిపట్టు సడలింది.

రాధ అన్నమాట నిజమే! అయినా నిస్సహాయురాలయిన ఓ ఆడపిల్ల ఆత్మహత్య వినా గత్యంతరం లేదని ఏడుస్తుంటే, మరు క్షణంలో ఆ అందమయిన జీవితం నీటిపాలు కాబోతుంటే, ఉద్రేకం, ఉత్సాహం, పౌరుషం, పరాక్రమం, స్పందించే గుండెగల ఏ యువకుడయినా ఆ పరిస్థితుల్లో ఎలా ప్రవర్తిస్తాడో ప్రభాకరం కూడా అలాగే చేశాడు. 'సర్వదేవత సాక్షి'గా రాధని పెళ్ళిచేసుకుంటానని ప్రమాణం చేసి, రాధ ఆత్మహత్యా ప్రయత్నాన్ని విరమింప చేశాడు.

ఆ మసక చీకటిలో ప్రభాకరం చేయి రాధ భుజాన్ని చుట్టి భద్రంగా నడిపిస్తుంటే కన్నీటితో మలినమయిన రాధ మొహంమీది చిరునవ్వులో విజయ గర్వాన్ని ప్రభాకరం గమనించలేకపోయాడు.

* * *

భవిష్యద్వాణి తెలిపినట్టుగా వెంకటరత్నంగారు మరునాడే పెళ్ళిముహూర్తం నిర్ణయించి ఆకిరిపల్లివాళ్ళకి వుత్తరాలు రాశారు. ఆ చేత్తోనే శ్రేయోభిలాషి పేరుతో ప్రభాకరం తల్లి తండ్రులకి కూడా ఓ ఉత్తరంరాసి పడేశారు ముందు జాగ్రత్తగా.

తిరుగు టపాలో ప్రభాకరానికి సొంత వూరు దయచేసి, వున్న పొలాన్ని సాగు చేసుకోమని, మరింక ఆ పట్నంలో ధార పొయ్యటానికి డబ్బు పంపేదిలేదని, మేనమామ తొందర పడుతున్నాడు కాబట్టి ఆ ఉత్తరాన్నే టెలిగ్రాంగా భావించుకుని తిరుగు టపాలో వచ్చివాలమని రాశాడు ప్రభాకరం తండ్రి.

రాధ మీద వెంకటరత్నంగారి ఆంక్షలు అధికమయ్యాయి. రాధని ఇల్లు కదలవద్దన్నారు. ఆయన కెందుకో ఈ పెళ్ళి జరగదన్న భయమే అంతరాంతరాల్లో తొలుస్తోంది. రాధ పెళ్ళి ఆయేవరకు ప్రైవేట్లు చెప్పటం కుదరదన్న సాకుతో ప్రభాకరం ఇంటికి వచ్చే అవకాశం లేకుండా పెద్ద అడ్డు తొలగినట్టుగా నిట్టూర్పు విడిచారు.

పెళ్ళి నాలుగు రోజులే వున్నదనగా రాధ ఇంట్లోంచి మెల్లగా తప్పించుకుని రంగనాథస్వామి ఆలయంలో ప్రభాకరం చేయి పుచ్చుకుని బరబరా కోనేటి దగ్గరకు లాక్కుపోయి ఎదురుగానిలబడి, "నువ్వింత పిరికివాడి వనుకోలేదు. నీ చేత్తో నువ్వే నన్నా నీళ్లలోకి తోసిపారేసి నా కీ బాధలనించి విముక్తి కలిగించు" అంది. ఆ క్షణంలో రాధ మొహం చూసిన ఏ యువకుడయినా ఏ మాట అంటాడో ప్రభాకరం కూడా అదే అన్నాడు. రాధ కళ్లు తళతళ మెరిశాయి.

* * *

మర్నాడు రాధ దిండుకింద దొరికిన ఉత్తరాన్ని చేత్తో పట్టుకుని అర్థంకానివాడిలా కూర్చున్నారు వెంకటరత్నంగారు. అందులో రెండే రెండు వాక్యాలున్నాయి.

నాన్నా,

ఆకిరిపల్లి నరకంలో పడి జీవితాంతం కుళ్ళిపోకుండా నాకు దోవ చూపించినందుకు మీకు కృతజ్ఞతలు. నన్ను క్షమించండి.

రాధ.

ఆయన పిచ్చివాడిలా ఆ ఉత్తరాన్ని పట్టుకుని ప్రభాకరం గదికి వెళ్ళి 'ప్రభాకరం' అంటూ బిగ్గరగా కేకేశారు. 'ప్రభాకరం స్నేహితుడు తొంగిచూసి ప్రభాకరం లేడండి. నిన్ననే గది ఖాళీ చేసి వెళ్ళిపోయాడు' అన్నాడు.

వెంకటరత్నంగారి కళ్లముందు 'ఒకానొక సీత కథ' గిర్రుగిర్రున తిరుగుతోంది. 'డామిట్. ఈకథల్రాసే వాళ్లని వురితియ్యాలి'అనుకున్నారాయన కసిగా, కోపంగా, విచారంగా, మండిపోతున్న గుండెలతో!

